# అంతర్యం

పోతూరి వెంకట సుబ్బారావు

రాత్రి భోజనం అయాక మంచంమీద పడుకొనివున్న తల్లిని పలకరించాడు రాంబాబు

నిద్ర పోతున్నావా? అమ్మా!

చివాల్న లేచి కూర్చుంది తల్లి

లేదు బాబూ! నీ భోజనం అయిందా? ఆప్యాయంగా అడిగింది

తల్లి పక్కనే మంచంమీద కూర్చున్నాడు రాంబాబు వెనుక గదిలో అర్ధాంగి లలిత వంట గిన్నెలు సర్దుకొంటోంది ఎన్నాళ్లనుంచో ఆ విషయం తల్లిని అడగాలనుకొంటున్నాడు రాంబాబు లలిత దగ్గర లేనప్పుడు అడగాలి ఆ పూట ధైర్యం చేసి తల్లిని అడగాలనుకొన్నాడు కానీ అడగడానికి ధైర్యం చాలడం లేదు

ఇప్పుడే చేసేనమ్మా! నీ ఫలహారం అయిందా? అడిగాడు

ఆఁ ఉప్పు పిండి చేసింది నీ పెళ్లాం! తల్లి మాటల ఉచ్చారణలో ఈసడింపూ చికాకూ ధ్వనించాయ్ తల్లి మాటల తీరుకే తా నడగాల్సిన విషయానికి చాలా దగ్గర సంబంధం వుంది సందర్భం కుదిరింది లలిత దగ్గర లేకపోవడంతో సమయం కూడా బావుంది

అమ్మా! నే నొకటి అడుగుతా! కోపం తెచ్చుకోవు కదా! నానుస్తూ అని అడిగాడు

అడుగుబాబూ! కోపం ఎందుకు? అని తల్లి లాలనగా అనడంతో ధైర్యం వచ్చింది రాంబాబుకి

లలిత నీ మాట కెప్పుడూ ఎదురు సమాధానం చెప్పదు! నవు చెప్పినట్లు నడచుకొంటుంది కదమ్మా! నెమ్మదిగా అన్నాడు

అవున్రా! ఇప్పుడు కాదన్నవాళ్లెవ్వరు? అంది తల్లి అనుమానంగా చూస్తూ

అదేనమ్మా! ఎవరూ కాదనరు! మరి అలాంటప్పుడు దానిని ఏవో ఎత్తిపొడుపు మాటల్తో సాదిస్తా వెందుకమ్మా! అదెంతో బాధ పడ్తోంది అనేసి తల్లి మొహంలోకి భయంగా చూశాడు రాంబాబు

తల్లి మొహంలో మందహాసం కన్పించింది

ఓరి పిచ్చి సన్నాసి! పెళ్లాంమీద నీ కెంతబిమానంరా! అది వుండాలిలే! లలిత నీకు పెళ్లాం అయితే నాకు కోడలు! ఈ యింటికి పెద్దదాన్ని! నే నిక్కడ వున్నంతకాలవూఁ నా అభీష్టానుసారం ఈ యింట్లో పనులు జరగాలి!

మధ్యలో నే అందుకొన్నాడు రాంబాబు,

అదేనమ్మా లలిత నీ ఆజ్ఞను జవదాటదుకదా! నూతిలో దూకమన్నా దూకుతుంది ఆమధ్య నీకు జ్వరం వచ్చినప్పుడు ఆ మూడు రోజులూ అదెంత కొట్టుకుపోయిందో నీకు తెలీదు! ఆ మూడు రోజులూ నీ దగ్గరే పడుకుంది!

నేను మాత్రం ఎలా కాదనగలనురా! నేనంటే దానికి వల్లమాలిన అభిమానం!

అవునుకదా! అయినా దానిని ఏదో దానికి సాదిస్తూనే వుంటావ్! నీ అంతర్యం అవగాహన కావడం లేదు! అన్నాడు మరోసారి ధైర్యం చేసి

మూడో యేట మా అత్తగారు పోయారు! మీ మామ్మని నువ్వెరగవు! మా అత్తగారికి యింతకు పది రెట్లు సేవ చేసేదాన్ని! అయినా ఆమె నన్నెంతగానో సాదించేది! నిల్చుంటే తప్పు! కూర్చుంటే తప్పు అవునంటే అపరాధం! కాదంటే కోపం! ఆమె చూస్తుండగా మీ నాన్నగారి కెదురుగా నిలబడ్డానికే భయం వేసేది! మా అత్తగారి దగ్గర నే నెన్ని ఆరళ్లు పడ్డానో ఆ భగవంతునికి తప్ప ఎవరికీ తెలీదు నువ్వంటున్న నా సాదింపు అందులో వెయ్యో వంతు కూడా వుండదు!

తల్లి మాటలకి నివ్వెరపోయాడు రాంబాబు వెంటనే మ ట్లాడలేకపోయాడు కొంత తేరుకొన్నాక అన్నాడు

ఆ నాడు కోడలుగా ఎన్నో బాధలు పడ్డాక

బాధ కాదురా! క్షీత క్షోభ అనుభవించా! మీ నాన్నగారికి తెల్సినా తల్లి దగ్గర నోరు కదిపేవారు కాదు! నాది అతి చాదస్తం! మడీ ఆచారం అంటాను! ఈకాలం పిల్లలకి అది నచ్చదు! నేనేదో అంటే నీ పెళ్లాం మనసు కష్ట పెట్టుకొంటోంది కాబోలు! నాకేవిరా! ఇంకా ముగ్గురు కొడుకు లున్నారు! చిన్నవాడివి కదా అన్న మమకారంకొద్దీ నీ దగ్గరుండాలనిపిస్తుంది! నీ అన్నలూ వదినలూ నన్ను పువ్వుల్లో పెట్టి పూజించుకొంటారు! నీ పెళ్లానికి కడుపు పోయి సుస్తీ చేసిందని ఓసారి రమ్మని నువ్వు ఉత్తరం రాస్తే మనసుండబట్టక వచ్చాను

తల్లి అపార్థం చేసుకొందనీ కోపం తెచ్చుకొందనీ గ్రహించిన రాంబాబు తడబడ్డాడు భయపడ్డాడు తల్లిని ప్రసన్నరాలునిగా చేసుకోవాలనే తాపత్రయంలో పడ్డాడు


అవునమ్మా! నువ్వొచ్చావు కాబట్టే అది తేరుకొంది! ఆ మాటే నీ కోడలు కూడా అంటుంది నేనిలా అడిగానని మరోలా అనుకోకమ్మా! ఈ విషయం లలితతో అనకు!

నీ పెళ్లాం చాలా నీరసంగా వుందిరా! ఒక్కర్తీ చేసుకోవడం కష్టం! మీ ఆఫీసరుగార్ని బతిమాలుకొని మన అనకాపల్లికి బదిలీ చేయించుకో! ఈ విశాఖపట్నంలో మూడొందలు యింటద్దె పోసి ఎలా బతుకుతావురా! అక్కడ సొంతిల్లు వుంది కదా! అందరవూ కల్సి వుండొచ్చు!

సంవత్సరంనుంచి మా ఆఫీసరుగార్ని అడుగుతూనే వున్నానమ్మా! ఈమారు గట్టిగా ప్రయత్నం చేస్తా! అంటూ లేచాడు రాంబాబు

* * * * * *

రాంబాబు ఎనిమిది సంవత్సరాల క్రితం మొట్ట మొదట సారిగా హైదరాబాద్‌లో వుద్యోగంలో చేరాడు అక్కడ ఆరేళ్లు పని చేశాడు ఉద్యోగంలో చేరిన మర్నాటినుంచి విశాఖపట్నం రీజన్‌కి ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నం మొదలు పెట్టాడు ఆరేళ్లు గడిచాయ్ బదిలీ కాలేదు తన దూరపు బంధువైన ఎమ్మెల్లేగారి ద్వారా మంత్రిగార్ని కలుసుకొన్నాడు భూమ్యాకాశాల్ని ఏకం చేసేనంత పని



చేసాడు ఎలాగైతేనేం విశాఖపట్నం రీజిన్‌కి ట్రాన్స్‌ఫర్ అయింది అయితే విశాఖపట్నం రీజినల్ ఆఫీసులో వేసారు తాను కోరుకొన్న అనకాపల్లి దొరకలేదు అన్న చింత విశాఖపట్నం వచ్చిన సంతోషంలో కొట్టుకుపోయింది హైదరాబాదు నుంచి విశాఖపట్నం ట్రాన్స్‌ఫర్‌చేసే అధికారం హైదరాబాదు డైరెక్టరుగారికే వుంది అయితే యిప్పుడు విశాఖపట్నం నుంచి అనకాపల్లి బదిలీ చేసే శక్తి నిత్యం తాను కలిసి కొలిచే బాస్‌కే వుంది నేలకొసారైనా తన అభ్యర్థనను బాస్‌కి జ్ఞప్తికి తెస్తూ భజన చేస్తూనే వుంటున్నాడు అయినా ప్రసన్నుడు కావడం లేదు! 'చేస్తాను అని అనకపోతే పోయాడు! కనీసం పరాకుగానైనా 'చూస్తాను' అని కూడా అనడు! అతని అంతర్యం అర్థం కాని రాంబాబుకి చీకాకు వేసినా చిరునవ్వుతో శలవు తీసుకొని చాంబర్సు నుండి బయట పడ్డాడు

ఈమారు గట్టిగా ప్రయత్నం చేయాలని నిశ్చయించుకొన్నాడు రాంబాబు

మర్నాడు లంచ్‌టైంలో బాస్‌ని కల్సాడు ప్రత్యేకంగా అతి వినయం ఒలకపోసాడు తన విజ్ఞాపనని మరోసారి విన్నవించుకొన్నాడు చిన్న కథ అల్లాడు

మా అమ్మగారు బాగా వయసు మళ్లిన మనిషిసార్! డెబ్బై దాటాయి! కళ్ళు సరిగా కన్పించవ్! ఇంతవరకు అనకాపల్లిలో మా పెద్దన్నయ్యా ఒదినా వుండేవారు! అతనికి రాజమండ్రి బదిలీ అయి వెళ్లిపోయారు! ఇప్పుడక్కడ ఆమె ఒక్కర్తే వుంటోంది! నా దగ్గరకి రమ్మంటే రానంటుంది తన భర్త కట్టిన యిల్లు వదిలి రానంటుంది ఆ యింట్లోనే ప్రాణం వదుల్తానంటుంది నిన్న రాత్రి వెళ్లి చూసి వచ్చా!ఆమె ఆరోగ్యం కూడా బావులేదు! ఎలాగైనా దయచేసి నాకు అనకాపల్లి బదిలీ యిప్పించండి సార్! అక్కడ రిటైర్మెంటు వేకెన్సీ వుండనే వుంది! తమరు కరుణించాలి! ఆఖరి దశలో అమ్మకి సేవ చేసే భాగ్యం కల్పించండ్సార్!'

దీన వదనంతో ప్రాధేయపడ్డాడు

అతని జాలి గాథని ప్రశాంతంగా విని నిదానంగా అడిగారు బాస్.

'మిష్టర్ రామారావ్! నీ సర్వీసెంత?'

'ఎనిమిది సంవత్సరాలు సార్!'

నా సర్వీసెంతో తెలుసా?'

తెలీదు సార్! పాతిక సంవత్సరాలు పైనే వుండొచ్చు!'

'ముప్పైయ్యేళ్ళు!'

'అవున్సార్! మీరు ఉద్యోగంలో చేరేసరికి నేను పుట్టనే లేదు!' అన్నాడు అతి వినయంగా

"మాది అమలాపురం!"

"అవున్సార్! ఎటెన్టివ్‌గా వున్నాడు రాంబాబు

పందొమ్మిది వందల అరవై తొమ్మిదిలో నాకు ప్రమోషనిచ్చి పఠాన్‌కోటలో వేసారు అక్కడ ఆర్నెల్లు పని చేసాక డిబ్రూగర్ పొమ్మన్నారు పోయాను

అక్కడనుంచి అగర్తలా, సిమ్లా, షిల్లాంగ్ ఆ తర్వాత గౌహతి, చండీఘర్, హిమాలయా తెక్కాను అస్సాం అడవుల్లో తిరిగాను పాకిస్తాన్ మనమీద వార్ డిక్లేర్ చేసినప్పుడు డభ్భైఒకటిలో గుజరాత్ గాంధినగర్‌లో వున్నా! పన్నెండు సంవత్సరాలబాటు ఫుట్‌బాల్ ఆటలో బంతిలా ఎన్నో కిక్కులు తిన్నా! ఎన్నో అవస్థలు పడ్డా! ఈ పన్నెండేళ్ళూ నా పెళ్లాం పిల్లల్నీ రాజమండ్రిలో వదిలేసా! శలవులకి నా దగ్గర కొచ్చేవారు! అప్పుడప్పుడు నేనూ పోతూ వుండేవాణ్ని! తలమ్ముకొన్నాక మనల్ని ఎక్కడ పని చెయ్యమంటే అక్కడ చేయాలి! ఈ విషయంలో మీరు చాలా అదృష్టవంతులు! మీ అనకాపల్లి ప్రయాణానికి అంగంటకన్నా ఎక్కువ పట్టదు! బజారు కెళ్లి వచ్చి నట్టుంటుంది! ఏమంటారు?" అని ఆగారు ఆఫీసరుగారు

ఏవీ అనలేదు రాంబాబు! ఏవీ అనలేకపోయాడు మౌనంగా వుండిపోయాడు

ఒక్క నిమిషం నిశ్శబ్దంగా గడిచింది.

"ఆఁ! ఎకౌంటెంటుని ఓసారి రమ్మనీ చెప్పండి!" అని ఆయన అనడంతో తనను వెళ్లమన్నట్టుగా అర్థమైంది రాంబాబుకి.

చేసేదిలేక ఛాంబర్ నుండి బయట పడ్డాడు రాంబాబు. □

